ANDHRA JYOTHI

11 APR 2021

## శుభశ్రీరాజన్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న శుభశ్రీరాజన్

యానాం, ఏప్రిల్ 10: యానానికి చెందిన యువ సాహితీవేత్త అల్లంరాజు శుభశ్రీరాజన్ శనివారం డాక్టరేట్‌ను అందుకున్నారు. ఇండియన్ ఎంపైర్ యూని వర్సిటీ ఆధ్వర్యంలో మైసూర్ వేదికగా జరిగిన కార్యక్ర మంలో యూనివర్సిటీ డెవల ప్మెంట్ కౌన్సిల్ వైస్‌ఛైర్మన్ కె.ప్రభాకర్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందు కున్నారు. డాక్టర్ హరిదాస్, కేపీ మనో హరన్, మలయాద్రి, డాక్టర్ మాధవిచౌదరి తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే పలు సాహితీ కార్యక్రమాల్లో అవార్డులు అందుకున్న శుభశ్రీరాజన్ ప్రస్తుతం పుదుచ్చేరి యానాంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

## యానాంలో పెరుగుతున్న కరోనా కేసులు

యానాం, ఏప్రిల్ 10: యానాంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగు తున్నాయి. శనివారం తాజాగా 22కొవిడ్ పాజిటివ్ కేసులు నమోద య్యాయి. 65 యాక్టివ్ కేసులున్నాయి. వారిలో 27మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, 38మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. వీరిలో ప్రైమరీ కాంటాక్ట్ ఉన్న వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. గవ ర్నర్ తమిళిసై యానాంలోని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ENADU

11 APR 2021

## ఆరు నెలల్లో యానాం మున్సిపల్ ఎన్నికలు

**యానాం:** యానాంతోపాటు పుదుచ్చేరి వ్యాప్తంగా అయిదు పురపాలక సంఘాలు, 10 పంచాయితీలకు ఆరు నెలల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదే శించింది. పురపాలక ఎన్నికలు నిర్వహించకుండా పుదు చ్చేరి ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాల్ని ధిక్కరించిందని మాహేకు చెందిన న్యాయవాది మద్రాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంతో రోహింగ్టన్ ఫాలీ నారిమన్, బీఆర్ గవాయ్ ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

**యానాం:** బెంగళూరుకు చెందిన యూని వర్శిటీ డాక్టరేట్లను ప్రదానం చేసినట్లు సర్వ శిక్షాభియాన్ మాజీ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గుత్తుల రామారావు, అల్లంరాజు శుభశ్రీరాజన్‌కు తెలిపారు.

## యానాంలో 22 కరోనా కేసులు

**యానాం:** యానాంలో శనివారం ఒక్కరోజే 22 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏక్టివ్ కేసుల సంఖ్య 78కి పెరిగింది. రాత్రి 12 నుంచి ఉదయం అయిదు గంటలు వరకు కర్ఫ్యూ అమలు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి లెఫ్టి నెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రకటించారు.

11 APR 2021 SAKSHI

## స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు కరోనా

యానాం: యానాం అసెంబ్లీ ఎన్నికల స్వతంత్ర అభ్యర్థి గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌కు శనివారం కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. తనవద్దకు వచ్చిన యువకులు, నాయకులు, మీడియావారు సైతం కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆయన శనివారం ప్రకటనలో కోరారు. తాను హోమ్ క్వారంటైన్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నానని తన వద్దకు ఎవరూ రావద్దని త్వరలోనే కోలుకుని ప్రజల ముందుకు వస్తానని ఆయన తెలిపారు.

VELUGU
11 APR 2021

## ఏప్రిల్ 11న 'తెలుగు సాహిత్యంలో అంబేద్కర్' సదస్సు

యానాం, ఏప్రిల్10: భారత రత్న డా. బి. ఆర్.అంబేద్కర్ 130 వ జయంతిని పురస్కరించుకుని కవి సంధ్య, దళిత రచయితల వేదిక,ఆంధ్ర ప్రదేశ్ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 11 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి 'తెలుగు సాహిత్యం లో అంబేద్కర్ ' అంశం పై ఒక రోజు అంతర్జాల సదస్సు నిర్వహిస్తున్నట్లు కవి సంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డా.శిఖామణి తెలిపారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొనే సభలో గోరటి వెంకన్న గౌరవ అతిథిగా, డా.డి.విజయ్ భాస్కర్ ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. డా.శిఖామణి కీలక ప్రసంగం చేసే ప్రారంభ సభకు దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహిస్తారు. డా.చల్లపల్లి స్వరూపరాణి, డా. జి. వి.రత్నాకర్,డా.కోయి కోటేశ్వరరావు,ఏన్.జే. విద్యా సాగర్, నేతల ప్రతాప్ కుమార్,డా.నూకతోటి రవికుమార్, డా. శాంత కుమారి, పెయ్యల పావన ప్రసాద్,డా.చిలుకోటి కూర్మయ్యలు వివిధ సాహిత్య ప్రక్రియ లలో అంబేద్కర్ పై వచ్చిన రచనల పై ప్రసంగ పత్రాలు సమర్పిస్తారు. డా. ఐన్న అయిలయ్య, డా. ప్రసాదమూర్తి, డా. దార్ల వేంకటేశ్వర రావు సదస్సులకు అధ్యక్షత వహిస్తారు.ముమ్మిడి నాగ ప్రసాద్, కొమ్మవరపు విల్సన్ రావు, అనిల్ డానీ, కొప్పోలు మోహన రావు, సుంకర గోపాల్ సమన్వయకర్తలుగా పాల్గొంటారు.

ANDHRA PRABHA
11 APR 2021

## మళ్ళీ విజృంభిస్తున్న మహమ్మారి

### ..యానాంలో 22 కరోనా కేసులు

**యానాం, ప్రభన్యూస్ :**

యానాం నియోజకవర్గంలో కరోనా మహమ్మారి రోజు రోజుకి విజృంభిస్తూ విలయతాండవం చేస్తుంది శనివారం ఒక్కరోజులోనే 22 కరోనా పాజిటివ్ కేసులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వందల సంఖ్యలో ప్రతిరోజు టెస్టులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సెకండ్ వేవ్‌లో 66 కేసులు నమోదు కాగా మొత్తం 2222 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు ఇప్పటివరకు 45 మంది మ తి చెందగా పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ తమిళ్ సై ఇప్పటికే నైట్ కర్ఫ్యూ అమలు చేశారు యానాం నియోజక వర్గంలో కూడా అదే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతు న్నారు సామాజిక దూరం, మాస్కులు, ధరించడం శానిటైజర్ ఉపయో గించడం ఫంక్షన్ హాల్ సినిమా హాల్స్ ఇటువంటి వాటి పై ఆంక్షలు విధించడం తదితర ముందస్తు చర్యలు చేపడితే కరోనా కేసులు తగ్గే అవకాశం కలుగుతుందని పలువురు కోరుతున్నారు అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

## పుదుచ్చేరి పీఠం

# దక్కేదెవరికో

VELUGU 11 APR 2021







- మాదంటే మాదంటున్న రెండు కూటముల నాయకులు
- నియోజకవర్గాలవారీ గెలుపు విశ్లేషణలో అన్ని పార్టీల నేతలు బిజిబిజీ
- నాలుగు లక్షల మంది ఓటర్ల మద్దతు పొందిన కూటమికే ముఖ్యమంత్రి పీఠం



యానాం, ఏప్రిల్10: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో హోరాహోరిగా రెండు ప్రధాన కూటముల మధ్య జరిగిన ఎన్నికల పోరులో తమదంటే తమది పై చేయి అంటూ ఆ కూటముల అగ్రనేతలు భరోసాగా ఉన్నారు. ఎన్డీయే కూటమి కింద ఎన్ఆర్ కాంగ్రెస్, బిజెపి, అన్నాడిఎంకె పార్టీలు ఉండగా యుపిఎ కూటమి కింద కాంగ్రెస్,డిఎంకె, కమ్యూనిస్టు తదితరపార్టీలో ఎన్నికల పోరులో తలపడ్డాయి. కాంగ్రెస్ కూటమికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టుకోలేకపోగా ఎన్ఆర్కాంగ్రెస్ పార్టీ మాహేలో ఆపార్టీ అభ్యర్థిని నిలబెట్టలేకపోయింది. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన స్థానాలలో 11 స్థానాలు రావడం ఖాయమంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.రంగసామి తాను పోటీ చేసిన యూనాం, తట్టంచావిడి నియోజకవర్గాల సీట్లలో గెలుపు ఖాయమని సర్వేలు ఇప్పటికే వెల్లడించాయి. బిజెపి పోటీ చేసిన సీట్లలో నాలుగు సీట్లు, అన్నాడిఎంకె పోటీ చేసిన సీట్లలో ఒక సీటు మాత్రమే గెలుచుకుని ఆ కూటమి 16 సీట్ల వరకు దక్కించుకోగలదని అంచనా వేస్తున్నారు. తట్టంచావిడి నియోజకవర్గానికి రాజీనామా చేసి యూనాంను ఉంచుకుంటానని ముందుగానే రంగసామి ప్రకటించడంతో ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఆయన గెలుపును బట్టి ఒక స్థానం వదులుకుని యూనాం స్థానాన్ని ఉంచుకోవడం ఖాయమంటున్నారు. ఫలితంగా 15 సీట్లతో ఎన్డీయే కూటమి మొదటి స్థానంలో ఉండగలదని అంచనా వేస్తున్నారు. యుపిఎ కూటమికి సంబంధించి కాంగ్రెస్ ఆరు స్థానాలు, డిఎంకె ఆరు స్థానాలు చొప్పున 12 స్థానాలు దక్కించుకోగలవని అంచనా వేస్తున్నారు. పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో గల మొత్తం 28 స్థానాలలో వివిధ పార్టీల తరఫున తిరుగుబాటు అభ్యర్థులుగా ఉన్న ముగ్గురు అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ఖరాఖండితంగా చెబుతున్నారు. ఇండిపెండెంట్లుగా గెలుపొందేవారి వారిలో అంగాలన్, నెహ్రూ,ప్రకాష్ పేర్లు వినిపిస్తుండగా గెలుపు గుర్రాలను తమ కూటమికి మద్దతు ఇచ్చేలా ఇప్పటి నుండే ఇతరపార్టీల నేతలు వారితో తదనుగుణంగా సంప్రదింపులు జరుపుతుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్డీయే కూటమి 21 స్థానాలు గెలుచుకోవడం ఖాయమని అన్ని సర్వే సంస్థలు ముందస్తుగా వెల్లడించినప్పటికి నియోజకవర్గాలవారీగా చూస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆ విధంగా ఉండకపోవడంతో 15కి మించి ఉండటం అసాధ్యమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ కూటమి దగ్గరికి వచ్చేసరికి 12 స్థానాలు ఖాయమని అంటున్నా మెజార్టీకి నాలుగు సీట్లు అవసరం ఉండటంతో ఇండిపెండెంట్ల మద్దతు ఏ మేరకు కూడగట్టగలరో అనే అంశంపై ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. ఎన్డీయే కూటమిలో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే ఆపార్టీ అగ్రనేత ముఖ్యమంత్రి అయ్యే సూచనలు ఉండటంతో ఏవిధంగా చూసుకున్నా ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.రంగసామికి నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కే అవకాశాలు ఉన్నాయని ఘంటాపథంగా చెబుతున్నారు. బిజెపి నాలుగు సీట్లకే పరిమితం అవడం ఖాయమని ఫలితంగా ముఖ్యమంత్రి పీఠం బిజెపికి ఎట్టిపరిస్థితుల్లో దక్కే సూచనలు లేవని, ఎన్డీయే కూటమి రథసారధిగా రంగసామి బిజెపి,అన్నాడిఎంకె పార్టీల మద్దతుతో ముఖ్యమంత్రి పీఠం దక్కగలదని అంచనా వేస్తున్నారు. పుదుచ్చేరిలో బిజెపి బలం అంతంత మాత్రంగానే ఉన్న పరిస్థితులలో ఆ పార్టీకి ఎంతమాత్రం పుదుచ్చేరి పీఠం దక్కకూడదనే కంకణం కట్టుకున్న కాంగ్రెస్, డిఎంకె కూటమి ఏదో విధంగా ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఆపార్టీ అగ్రనేత ఎన్.రంగసామికే ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేలా చేసి అనూహ్యంగా మిగిలిన పార్టీల మద్దతుతో బిజెపియేతర కూటమిగా అవతరించినా పుదుచ్చేరి రాజకీయాల పరంగా చూస్తే ఎంతమాత్రం ఆశ్చర్యపోనవసరం లేదని అదే కోణంపై రకరకాలుగా విశ్లేషించుకుంటూ ఆ ప్రతిపాదన ఏదో ఒక రూపంలో పుదుచ్చేరి రాజకీయ తెరపైకి రావడం ఖాయమంటున్నారు. పుదుచ్చేరి శాసన సభ పరిధిలోని 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 10 లక్షల నాలుగువేల 507 మంది ఓటర్లు ఉండగా వారిలో 81.88 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ఓటు హక్కు ఉపయోగించుకున్న వారిలో ఏ కూటమికి అయితే నాలుగు లక్షల మంది ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటారో ఆ కూటమి అగ్రనేత ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి కనిపిస్తుండటం విశేషం. అదే ఆంధ్రప్రదేశ్‌లో అయితే యానాం సమీపంలోని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక ఎంపిని ఎన్నుకోవడానికి సుమారు 10 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు ద్వారా ఎన్నుకుంటారు. అదే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అయితే పది లక్షల మంది ఓటర్లు ఓటు వేసి తమకిష్టమైన అభ్యర్థులను ఎన్నుకునే విచిత్ర పరిస్థితి పుదుచ్చేరిలో నెలకొంది. పుదుచ్చేరిలో 81.88 శాతం మంది మాత్రమే ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకోవడంతో నాలుగు లక్షల మంది ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారో ఆ కూటమి నాయకుడు ముఖ్యమంత్రి కావడం పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత విశేషం.

